క్లుప్తంగా

గాయత్రీ దేవికి ప్రత్యేక పూజలు

పాలకొండ: మండలంలోని ఎన్‌కే రాజపురం గ్రామ పరిధిలో ఉన్న గాయత్రీదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మృగశిర కార్తె సందర్భంగా రైతులకు అన్నివిధాల అనుకూలంగా ఉండాలని కోరుతూ అమ్మవారికి పూజలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బంకుపల్లి చిట్టిబాబు శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు ఇవ్వండి

గుమ్మలక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి చెల్లించాల్సిన బకాయి వేతనాలు వెంటనే అందజేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం డిమాండ్ చేశారు. సమాజానికి ఆరోగ్యవంతమైన పంటను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న సిబ్బందికి 16 నెలలుగా వేతనాలు చెల్లించలేదని, దీంతో ఆయా కుటుంబాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి, తక్షణమే బకాయి వేతనాలు మంజూరు చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి రోడ్డులో సాధారణ తనిఖీల్లో భాగంగా పోలీసులు శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. అలాగే ద్విచక్రవాహనాలపై గ్రామాల నుంచి సాలూరు పట్టణానికి వచ్చిపోయే వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు, అలాగే డ్రైవింగ్ లైసెన్సులు, హెల్మెట్లు లేని వారిపై కేసులు నమోదుచేస్తున్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ఉన్న ఆంక్షలు తొలగి పోవడంతో సగంలో నిలిచిపోయిన పనులు ప్రారంభించడానికి నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కోడ్ అమలు చేయడంతో అప్పట్లో చేయాల్సిన పనులు అర్ధాంతరంగా నిలిపివేయాల్సి వచ్చింది. కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి కోడ్‌ఎత్తివేస్తూ ఉత్తర్వులు వెలువడడంతో నిర్వాహకులు పనులు చేపట్టడానికి ముడిసరుకులు సిద్ధం చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులనుంచి నిర్వాహకులకు అనుమతులు రావాల్సి ఉంది.

తపాలాశాఖ వినూత్న కార్యక్రమం

పార్వతీపురంటౌన్: 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా నిలిచిన నాయకులకు ఈ పోస్ట్ సర్వీసు ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాలాశాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, అభిమానులు రూ.10 చెల్లించి సమీపంలోని తపాలా కార్యాలయంలో ఈ పోస్ట్ ద్వారా శుభాకాంక్షలు తమ నేతకు తెలియజేయవచ్చు. ఇలా పంపించిన సందేశాలు నేరుగా నేతలకు వెళ్తాయి. కావున ఈ అవకాశం వినియోగించుకోవాలని తపాలాశాఖ నుంచి కోరుతున్నారు.

గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా

సీతానగరం: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల గృహావసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి మండలంలో ప్రత్యేక లైన్లు వేసే పనులు జరుగుతున్నాయని ఏఈ జగన్‌మోహనరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ అప్పయ్యపేట సబ్‌స్టేషన్ పరిధిలో తామరఖండి ఫీడర్ పరిధి గ్రామాలకు విద్యుత్‌లైన్ పనులు జరిగాయని తెలిపారు. తాజాగా కాశీపేట ఫీడర్ పరిధిలో ఉన్న గ్రామాల గృహావసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి అవసరమైన పవర్‌లైన్ పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. అలాగే మండలంలోని అన్నిగ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి అవసరమైన మెటీరియల్‌ను కనస్ట్రక్షన్ శాఖ సిద్ధం చేసుకున్నాక పూర్తిస్థాయిలో గృహావసరాలకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు వివరించారు.

విత్తనోత్పత్తిపై అవగాహన అవసరం

సీతానగరం: గ్రామాల్లో రైతులు స్వయానా విత్తనాలు తయారు చేయడానికి అవగాహన కల్పించుకోవాలని ఏఓ ఎస్.అవినాష్ కోరారు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా శుక్రవారం ఆయన సీతానగరం మండలంలోని వెంకటాపురం, పణుకుపేట, ఏగోటివలసలో రైతులతో కలిసి నారు మడులను సందర్శించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ వరిసాగుకు వరినారు వేయాల్సిన మళ్లలో విత్తనశుద్ధి, మట్టిని శుద్ధి చేయడం, శత్రు క్రిమి కీటకాల నివారణకు ముందుజాగ్రత్త చర్యగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరినారుమళ్లలో విత్తనాలు ఉత్పత్తి చేయడానికి అవసరమైన మెలకువలు పాటించాలని సూచించారు. మండలంలో 1064 రకం వరిసాగుకు నేలలు అనుకూలంగా ఉన్నాయని గుర్తించి వివిధ గ్రామాలకు చెందిన రైతులు గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగస్వాములు కావాలని, ఇక్కడ తయారు చేసిన విత్తనాలు పలుప్రాంతాలకు సరఫరా చేసే విధంగా సిద్ధం కావాలని కోరుతున్నామన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ ఎస్.అవినాష్

మేలు రకం విత్తనాలతో

అధిక దిగుబడులు



ట్రాక్టర్‌తో దుక్కు

- ఆర్‌బీకేల ద్వారా రాయితీ విత్తనాల పంపిణీ
- ఊపందుకున్న దుక్కులు
- నారుమడులు సిద్ధం చేసే పనిలో రైతులు

పాలకొండ రూరల్: తొలకరి చినుకులు పలుకరిస్తుండడం... రుతు పవనాలు అనుకూలిస్తుండడంతో అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్ ప్రణాళికలలో భాగంగా వ్యవసాయ శాఖ అన్నదాతలకు లబ్ధి చేకూర్చేలా కసరత్తు ప్రారంభించింది. ఖరీఫ్‌లో కీలకమై విత్తన పంపిణీలో గత అనుభవాను దృష్టిలో పెట్టుకుని మరింత సమర్థవంతంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వరి సాగు దాదాపు 70 వేల హెక్టార్లలో చేపట్టనున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకునే వరి వంగడాలను రైతుల అవసరాల మేరకు 26,416 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధం చేశారు. ఈ క్రమంలో సాధారణ రాయితీపై 17,424 క్వింటాళ్లు, షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై 8,992 క్వింటాళ్ల విత్తనాలు అందించనున్నారు. చిరుధాన్యాలు, పచ్చిరొట్ట వంగడాలు, ఎరువుల పంపిణీపై ముందస్తు ప్రణాళికలతో ముందుకు వెళుతున్నారు. ఈ తరుణంలో భూసారానికి అనువైన వరి వంగడాలను రైతులు ఎంచుకుని సేద్యం చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

స్వర్ణ రకం...

ఎంటీయూ–7029 (స్వర్ణ) రకం వంగడాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. 155 రోజుల వ్యవధిలో ఈ రకం వంగడం కోతకు వస్తుంది. ఎక్కువగా గాలి, వర్షాలకు తట్టుకోలేదు. తెగుళ్ల బెడద అధికమే. అయినప్పటికీ దిగుబడి అధికంగా ఇస్తుంది. ఈ కారణంతోనే రైతులు ఈ రకం సాగుకు ముందుకు వస్తున్నారు. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల మేర దిగుబడి వస్తుంది.

- **ఎంటీయూ – 1318**

ఖరీఫ్‌లో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా ఎంటీయూ–1318 వాడుకోవచ్చు. మాటేరు పరిశోధనా కేంద్రంలో రూపొందిన ఈ వంగడం పంట కాలం 155–160 రోజుల మధ్య ఉంటుంది. తెగుళ్లను తట్టుకుంటుంది. పాముపొడ తెగులు, దోమపోటు, అగ్గి తెగులుతో పాటు ప్రకృతి వైపరిత్యాల సమయంలో గాలులను తట్టుకోగలదు. దిగుబడి ఆశించిన మేర లభిస్తుంది. నీటివసతి అధికంగా ఉన్న ప్రాంత రైతులు ఈ వరి వంగడాన్ని సాగుచేయవచ్చు.



ముంపు పరిస్థితిని తట్టుకునే స్వర్ణ రకం వరి పంట

- **సాంబమసూరి...**

బీపీటీ–5204 (సాంబమసూరి) పంట కాలం 155–160 రోజులు. సన్నరకం ఫైన్ క్వాలిటీ. ఈ ప్రాంత రైతులు తమ ఇంటి అవసరాలకు ఈ రకం సాగు చేస్తారు. బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఎక్కువ ఆశిస్తుంది.

- **ఇంద్ర..**

ఎంటీయూ–1061 (ఇంద్ర) పంటకాలం150 –155 రోజులు. ఇది కూడా స్వర్ణ మాదిరిగానే ఉంటుంది. ముంపు ప్రాంత రైతులకు ఈ వంగడం అనుకూలం. ఎక్కువ రోజులు ముంపులో ఉన్నా ఈ పంటకు నష్టం ఉండదు. వర్షాలు, గాలులకు తట్టుకుంటుంది. స్వర్ణకు ప్రత్యామ్నాయంగా ఈ రకం సేద్యం చేయవచ్చు.

- **ఎంటీయూ–1064...**

తొలకరిలో స్వర్ణకు ప్రత్యామ్నాయంగా సిద్ధం చేసిన ఈ రకం వంగడం పంట కాలం 145 నుంచి 150 రోజులు. ఎకరాకు 25 నుంచి 30 బస్తాల దిగుబడి వస్తుంది. స్వర్ణకు దీటుగా దిగుబడి రావడం లేదని రైతులు ఆసక్తి చూపటం లేదన్న వాదన ఉంది. ముంపు ప్రాంతాలకు ఈ రకం వంగడం అనువైన రకం.

- **ఎంటీయూ–1075..**

ఈ రకం ఎక్కువగా పొడవుగా ఎదుగుతుంది. గాలులుకు పడిపోయే గుణం తక్కువ. పంట కాలం 145 నుంచి 150 రోజులు ఉంటుంది. దిగుబడి ఎకరాకు 25 నుంచి 28 బస్తాల వరకు వస్తుంది.

- **ఎంటీయూ –1121..**

ఇది ఫైన్ క్వాలిటీ సన్న రకం. దీని పంట కాలం 150 రోజులు. కొంతవరకూ దోమపోటును తట్టుకుంటుంది. ఎకరాకు 30 – 35 బస్తాల దిగుబడి వస్తుంది .

విత్తన ఎంపికే కీలకం



భూసార పరీక్షలు చేయించడం ద్వారా భూమి సత్తువను అంచనా వేయాలి. అందుకు అనువైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. రైతుభరోసా కేంద్రాల ద్వారా రాయితీపై వరి విత్తనాలు అందజేస్తున్నాం. వాతావరణ పరిస్థితి, ముంపుడు భూములు, నేల స్వభావం, ప్రకృతి వైపరిత్యాలను అధిగమించే వంగడాలను ఎంచుకుంటే మంచిది.

– కె.రత్నకుమారి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు, పాలకొండ.

విత్తనాల రాయితీ వివరాలు

వరి విత్తనం రకం	కేజీలు	మొత్తం ధర	సాధారణ రాయితీ	90 శాతం రాయితీపై
ఎంటీయూ–1224(మాటేరు సాంబ)	25	రూ.1,045	రూ.795	రూ.104.50
బీపీటీ–5204(సాంబ మసూరి)	25	రూ.1,045	రూ.795	రూ.104.50
ఆర్‌జీఎల్–2537(శ్రీకాకుళం సన్నాలు)	30	రూ.1,254	రూ.954	రూ.125.40
ఎంటీయూ–7029(స్వర్ణ)	30	రూ.1,194	రూ.894	రూ.119.40
ఎంటీయూ–1061(ఇంద్ర)	30	రూ.1,194	రూ.894	రూ.119.40
ఎంటీయూ–1318		రూ.1,194	రూ.894	రూ.119.40
ఎంటీయూ–1064(అమర)	30	రూ.1,194	రూ.894	రూ.119.40
ఎంటీయూ–1121(శ్రీధృతి)	30	రూ.1,194	రూ.894	రూ.119.40
బీపీటి–3291(సోనా మసూరి)	30	రూ.1,134	రూ.834	రూ.113.40

చురుగ్గా శానిటేషన్ పనులు

భామిని: మండల కేంద్రంలో డాక్టర్ దామోదరరావు ఆధ్వర్యంలో శుక్రవారం శానిటేషన్ పనులు చురుగ్గా జరిగాయి. దోమల నివారణకు కాలువల్లో మలాథియాన్ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

సమ్మె బాట పడతాం



సమ్మె నోటీసు అందిస్తున్న యూనియన్ నాయకులు

- మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్

సాలూరు: మున్సిపల్ కార్మికుల బకాయి వేతనాలు ఇవ్వడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు సమ్మె నోటీసు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం సాలూరు మున్సిపల్ కార్యాలయంలో సమ్మె నోటీసును కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బకాయి వేతనాలు చెల్లించకుండా జాప్యం చేయడం, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని కౌన్సిల్ చేసిన తీర్మానం అమలు చేయకపోవడానికి, డ్రైవర్లకు పెంచిన వేతనాలు చెల్లించకపోవడానికి నిరసనగా ఏ రోజు నుంచైనా తాము సమ్మె బాట పడతామని స్పష్టం చేశారు. కాగా కార్మికుల సమస్యలు తెలియచేయడానికి వెళ్తే కమిషనర్ నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని, దీనిని యూనియన్‌తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాముడు, శంకరరావు, శీను ,రవి, మధు ఉన్నారు.

అవగాహన తప్పనిసరి..

పాలకొండ రూరల్: సంబంధం లేని ఘర్షణల్లో చిక్కుకోవడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలు, యువత అవగాహన పెంచుకోవాలని పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్‌ను ఎత్తివేస్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. బుక్కూరు, అవలంగి, వెలగవాడ, సిరికొండ, తదితర గ్రామాల ప్రజలతో మమేకమయ్యారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

సాలూరు రూరల్: పదవతరగతి పూర్తిచేసుకుని గురుకుల పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు మెడికల్ సర్టిఫికెట్లు ప్రభుత్వ డాక్టర్ల వద్ద పొందుతున్నారు. ఈ క్రమంలో మామిడిపల్లి పీహెచ్‌సీ డాక్టర్.ఉదయ వద్దకు వచ్చి మెడికల్ సర్టిఫికెట్లు పొందుతున్న విద్యార్థులకు ఆమె ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థి దశలో ప్రధానంగా ఆరోగ్యంగా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థినులు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని, ఆరోగ్యంగా ఉంటే శ్రద్ధగా చదవగులుగుతార న్నారు. సర్టిఫికెట్ల కోసం వచ్చిన విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు.

అటవీ, గిరిజన సంక్షేమ శాఖలను గిరిజనులకే కేటాయించాలి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో త్వరలో ఏర్పాటుకానున్న మంత్రివర్గంలో ఇద్దరు గిరిజన నేతలకు మంత్రి పదవులు కల్పించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడిన ఆయన.. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువగా గిరిశిఖర గ్రామాలు ఉన్నాయని, అక్కడ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు పొందడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గిరిజన ప్రాంతాల్లోని ఎంతో విలువైన ఖనిజ సంపద, కలపను కాపాడుకోవాలంటే అటవీ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిత్వ శాఖలను గిరిజన నేతలకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా శాఖలను గిరిజన నాయకులకు ఇవ్వడం ద్వారా గిరిజన ప్రాంతాలు అభివృద్ధిని చూస్తాయన్నారు. త్వరితగతిన ప్రగతి పనులకు అనుమతులు లభిస్తాయన్నారు. సకాల సదుపాయాలతో గిరిజన ప్రాంతాలు వెలిగిపోతాయన్నారు.



మాట్లాడుతున్న ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు లోవరాజు

హెచ్‌టీ కాటన్ విత్తనాలు వాడవద్దు

జియ్యమ్మవలస: పొలాల్లో నాటేందుకు హెచ్‌టీ(హెర్బిసైడ్ టోలరెంట్) కాటన్ పత్తి విత్తనాలు వాడవద్దని ఏవో హర్షలత సూచించారు. మండలంలోని గవరంపేట గ్రామ రైతులతో శుక్రవారం సమావేశమైన ఆమె.. హెచ్‌టీ విత్తనాలు వేసే రైతులకు ప్రభుత్వ పరంగా అందే రాయితీలు వర్తించవన్నారు. పత్తిని సాగు చేయాలనుకునే రైతులంతా హైబ్రీడ్ బీటీ రకం విత్తనాలు వేసుకోవాలన్నారు. ఎవరైనా హెచ్‌టీ కాటన్ విత్తనాలు సాగు చేస్తే 155251 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఆర్‌బీకేల్లో 195 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 2,796 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏవో హర్షలత

10న ఆత్మల సంపాదన మహాపండగలు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆత్మల సంపాదన మహాపండగలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ పి.షాలేమురాజు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రార్థనా కూటములకు రాజమండ్రికి చెందిన అంతర్జాతీయ సువార్తకులు పాస్టర్ సీహెచ్ సంతోష్‌రెడ్డి, విశాఖపట్నం నుంచి పాస్టర్ వి.ప్రకాష్‌లు హాజరై, ప్రజలు పరలోకం పొందేందుకు జీసస్ చేసిన బోధనలను వివరిస్తారన్నారు. దూరప్రాంతాల నుంచి కార్యక్రమానికి హాజరయ్యే విశ్వాసకులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. క్రైస్తవ సోదరులంతా ఈ ప్రార్థనలకు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

మలేరియాపై అవగాహన అవసరం

పాలకొండ రూరల్: మలేరియా రహిత సమాజమే ధ్యేయంగా సిబ్బంది క్షేత్ర స్థాయిలో సేవలు అందించాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.రవికుమార్, శివశంకర్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మలేరియా నివారణ మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. వర్షాకాలంలో గ్రామీణ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు దృష్టి సారించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహారపదార్థాలను తీసుకోవాలన్నారు. జర్వ లక్షణాలు గుర్తిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని భామిని, మెళియాపుట్టిలలో ఉన్న ఏకలవ్య మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు మాట్లాడుతూ, భామిని ఈఎంఆర్‌ఎస్‌లో హెచ్‌ఈసీ గ్రూప్‌లో బాలురుకు 8, బాలికలకు 4 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. మెళియాపుట్టి ఈఎంఆర్‌ఎస్‌లో హెచ్‌ఈసీ గ్రూప్‌లో బాలురుకు 13 సీట్లు, బైపీసీలో 3 సీట్లు, బాలికలకు 8 సీట్లు ఖాళీగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆయా ఖాళీల భర్తీకి కూడా త్వరలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, కన్వీనర్ ప్రిన్సిపాల్ కె.సురేష్, రాధాకృష్ణ, సీఎంఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

వర్షాకాలంలో జీవాలకు వ్యాధులు..

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో జీవాలకు వ్యాధులు సోకే ప్రమాదం అధికంగా ఉందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ప్రభామాణిక్యరావు అన్నారు. శుక్రవారం తన సిబ్బందితో కలసి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు బ్లూటంగ్ ఫుట్‌రాట్ వ్యాధిపై అవగాహన కల్పించారు. గొర్రెలు, మేకలకు ఈ వ్యాధి సోకితే అధిక జ్వరం, మూతివాపు, పెదవులు దద్దరించడం, నోటిలో పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్లు కుంటడం, మేత మేయకపోవటం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. వీటి నివారణకు సాయంత్ర సమయంలో మందలో వేపాకు పొగ వేయాలన్నారు. బ్లూటాక్స్/టిక్కల్ మందులు పిచికారీ చేయించాలని సూచించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

పాలకొండ రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు బౌరోతు శంకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పుస్తకాల స్నేహం సమాజంలో ఉన్నత స్థానంలో నిలుపుతుందన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపులో భాగంగా ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన చిన్నారులు, విద్యార్థులకు బహుమతులను అభ్యుదయ రచయిత నూతలపాటి భరత్‌భూషణ్‌రాజు అందించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వైఎస్ శాంతిశ్రీ, గ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబు, జి.మురళి, సహాయకుడు ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, వక్తలు, గ్రంథాలయ అధికారులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



గరుగుబిల్లి: తరగతి గదుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న దృశ్యం



దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి జగన్‌మోహన్‌రావు

గుమ్మలక్ష్మీపురం: సీజనల్ జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారు వెంటనే ఆస్పత్రిని సంప్రదించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. మండలంలోని ఎస్.కశిగొట్టు గ్రామంలో వైద్యారోగ్య సిబ్బంది చేపట్టిన ఫీవర్ సర్వే, దోమల నియంత్రణ చర్యలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో భూగర్భంలోని నీరు కలుషితమవుతుందని, ఈ సీజన్‌లో తాగేనీటి వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వీలైనంతవరకు కాచి వడపోసిన నీటినే తాగడానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. అలాగే కాలువల్లోని మురుగునీటిలో దోమలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని, దీంతో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతాయని, ప్రతీ గ్రామంలో దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు. అనంతరం భద్రగిరి సీహెచ్‌సీని సందర్శించి, అక్కడి ల్యాబ్ రికార్డులు పరిశీలించారు. జ్వర నిర్ధారణకు అక్కడికి వచ్చిన శాంపిల్స్ ఆధారంగా ఎక్కువ మంది మలేరియాతో బాధపడుతున్నట్లు గుర్తించి, మలేరియా బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో దోమల నివారణ మందు శుక్రవారం పిచికారీ చేశారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో దోమలు పెరగకుండా గురుకులం పరిసరాలు, తరగతి గదులు, వసతిగృహాలు, కాలువల దగ్గర దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు వైద్యుడు సంతోష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

పాలకొండ : రైతులకు కావాల్సిన వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని వ్యవసాయ శాఖ ఎ.డి రత్నకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుభరోసా కేంద్రాల వద్ద రైతులు తమ పేర్లు నమోదు చేసుకుని విత్తనాలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరి విత్తనాలతో పాటు పచ్చిరొట్ట విత్తనాలు కూడా రాయితీపై అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.